# భద్రం తల్లీ...!

చల్లపల్లి. స్వరూపరాణి

నేను చచ్చినా ఆ హాస్టల్ కెళ్ళనమ్మా" ఖచ్చితంగా అన్నాను అమ్మతో.

"నా తల్లివి కదూ! ఎలాగో ఈ రెండేళ్ళు ఓర్చుకోమ్మా! తర్వాత నీకేబాధ ఉండదు" బ్రతిమాలుతూ నా బట్టలు, పుస్తకాలు సంచిలో సర్దుతుంది అమ్మ.

సెలవులకి ఇంటికొచ్చిన ప్రతిసారీ నేనిలా హాస్టల్ కెళ్ళనని మంకుపట్టడం అమ్మా, నాన్నా బుజ్జగించి నన్ను మళ్ళీ హాస్టల్‌కి పంపడం మామూలే! నాకు తోడు మా బాబీ కూడా ఈ మధ్య తయారయ్యాడు. వాడెప్పుడు చూసినా "నేను హాస్టల్ కెళ్ళను. ఇంటి దగ్గరే వుండి అమ్మకి పనులందిస్తా" నంటాడు.

మా వూరి బడిలో ఐదో క్లాసు వరకే వుండడంతో హైస్కూలు చదువుకి మేము చచ్చినట్టు పట్నం రావాల్సి వచ్చింది. నేను ఆరోక్లాసు నుండీ హాస్టల్లో వుంటూ ఎనిమిదో క్లాసు వరకూ ఎలాగో వచ్చాను.

నాతోపాటు మా వూరు నుండి, అరుణ, వసంత, నిర్మల ఇంకా కొంతమంది అమ్మాయిలు కూడా హాస్టల్‌లో చదువుకుంటున్నారు. ఒకే వూరు వాళ్ళం హాస్టల్‌లో కూడా స్నేహంగా వుండేవాళ్ళం.

మా హాస్టల్‌లో వేరు వేరు స్కూళ్ళ పిల్లలు వుండే వారు. హాస్టల్ మాత్రం ఆడపిల్లల కోసమే ప్రత్యేకంగా సాంఘిక సంక్షేమశాఖవారు ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల వూళ్ళ నుండి నాలాంటి ఆడపిల్లలంతా అక్కడ చేరేవారు.

యింట్లో పూసే కనకాంబరాలు మాత్రం మర్చి పోకుండా మాలకట్టి నాకు తీసుకొచ్చేది. ఆ పూల ముందు హాస్టల్ తోటలో పూలన్నీ దిగదుడుపే. వాటిని వడిలిపోయేదాకా పెట్టుకునేదాన్ని అపురూపంగా.

అమ్మ వార్డెన్ దగ్గర పర్మిషన్ తీసుకుని నన్ను కూడా బాబీగాడి హాస్టల్‌కి తీసుకెళ్ళేది. వాడూ, నేనూ కబుర్లతో అమ్మకు ఊపిరాడనిచ్చేవాళ్ళం కాదు. వాడైతే తన ఫ్రెండ్స్ గురించి అమ్మకి చాడీలు చెప్పే వాడు. ఎవుడూ వాడు కొట్టాడు, వీడు తిట్టాడని చెప్పి వాళ్ళతో పోట్లాడమని అమ్మకి చెప్పేవాడు.


అమ్మ మాత్రం అన్నింటికీ నవ్వేసి ఊరుకునేది.

అమ్మలు రానివాళ్ళు భలే ఏడ్చేవాళ్ళు. పాపం! వాళ్ళని చూస్తే జాలేసేది. పనుల రోజుల్లో కూలి దొరుకుతుందో లేదో చెప్పలేము. ఎలాగో కష్టపడి గవర్నమెంట్ హాస్టల్లో చదువుకోండమ్మా! ఈ చదువు కూడా లేకపోతే రేపు మీరు కూడా మాలాగే కూలీ నాలీ చేసుకోవాల్సి వస్తుంది. కష్టపడి నాలుగక్షరాలు నేర్చుకుంటే రేపు సుఖపడేది మీరే కదా!"

అమ్మా నాన్నా మా యిద్దరికీ అనేక విధాలుగా చెప్పి పంపేవారు.

మా హాస్టల్‌లో ఏడు, ఎనిమిది క్లాసుల అమ్మాయిలు పెద్దయితే ఆయమ్మని తోడిచ్చి వాళ్ళ యిళ్ళకి పంపేవారు. పెద్దయినమ్మాయి వూరు నుండి రాగానే ఆమె వైపు అందరం వింతగా చూసేవాళ్ళం.

వార్డెన్‌గారి కళ్ళు మాత్రం పెద్దగా కనిపించే అమ్మాయిల వైపే వుండేవి. అవసరం వున్నా లేకపోయినా మీద చెయ్యేసి మాట్లాడేవాడు.




ఉదయం ఐదున్నరకి అందరం నిద్రలేచి ప్రార్థనకి కూర్చునేవాళ్ళం. ప్రార్థన అయిపోగానే పుస్తకాలు ముందేసుకుని ఎనిమిది గంటల వరకు చదివి ఎనిమిది నుండి తొమ్మిది గంటలలోపల స్నానాలు, అన్నం తినడం పూర్తి చేసుకుని ఎవరి స్కూళ్ళకి వాళ్ళు వెళ్ళిపోతాం!

స్నానాల గదుల దగ్గర రోజూ పోట్లాటే! చిన్న పిల్లలకు విడిగా స్థలం వుంది. అక్కడ అందరూ పక్కపక్కనే స్నానాలు చేస్తారు. పెద్ద పిల్లలకు మాత్రం ఒకే ఒక్క బాత్‌రూమ్ వుంది. దానిలో స్నానం చెయ్యడానికి నేను ముందంటే నేను ముందని తోసుకునేవారు.

మధ్యాహ్నం భోజనం కోసం హాస్టల్‌కొచ్చి హడావిడిగా తిని పరుగెత్తేవాళ్ళం. ఆదివారం వచ్చిందంటే మాత్రం అందరికీ క్రిస్మస్ పండగంత ఆనందం.

రేపు ఆదివారం అనగా ముందు రాత్రి మంచి మంచి ఆలోచనలతో నిద్రపట్టేది కాదు. అమ్మ ఏమేం తెస్తుందో అని ఆమె రాక గురించి కలలు కనేదాన్ని. రోజుకంటే ముందే నిద్ర లేచేదాన్ని. మధ్య మధ్యలో గేటు వైపు చూస్తూ దొంగ ప్రార్థన చేసేదాన్ని.

రోజూ ఇంత శుభ్రంగా వుంటున్నానని అమ్మ అనుకోవాలని శుభ్రంగా తలస్నానం చేసి వదులుగా ఒక్క జడ వేసుకుని వున్న వాటిల్లోనే మంచి ఫ్రాక్ వేసుకునేదాన్ని.

అమ్మ గేటులో అడుగు పెడుతుందో లేదో పరుగెత్తుకుంటూ వెళ్ళి గట్టిగా వాటేసుకునేదాన్ని. అమ్మ నన్ను చూసి ముసిముసిగా నవ్వుకుంటూ వచ్చి చెట్టుకింద కూర్చునేది.

అమ్మ తీసుకొచ్చే పులిహోర అన్నం, పాయసం కోసం బుట్టలో చెయ్యిపెట్టి చూసేదాన్ని. మా అమ్మ కూడా వచ్చేది కాదు. నేను రూములో పడుకుని వెక్కి వెక్కి ఏడ్చేదాన్ని.

స్నేహితులతో, చదువుతో, సరదాగా వున్నా హాస్టల్‌లో వుండాలంటే ఏడుపొస్తుంది.

మా హాస్టల్ వార్డెన్ గారంటే అందరికీ హడల్! ఆయన్ని చూస్తే గలగల మాట్లాడుకునేవాళ్ళం గప్‌చిప్ అయిపోతాం! ఆయన చీటికీ మాటికీ మమ్మల్ని తిట్టడం, కొట్టడం చేసేవాడు.

ఎవరైనా చిన్న తప్పు చేస్తే లోపలికి పిల్చి వాతలు పడేట్టు కొట్టేవాడు.

"పేడకళ్ళు ఎత్తేసే వాళ్ళకు చదువు ఎలా వస్తుంది" అనేవాడు.

వార్డెన్‌గారి క్వార్టర్ కూడా మా హాస్టల్ కాంపౌండ్ లోనే వుంది. మేమంతా ఆయనకి పని మనుషులతో సమానం! తరచుగా వాళ్ళింట్లో పనులు చేయించే వాడు. చెప్పిన పని చెయ్యకపోతే ఆ రోజు అన్నం పెట్టేవారు కాదు.

ఇవన్నీ నాకు చాలా బాధగా అనిపించేవి. ఆయన తిట్లు తల్చుకుంటే ఏడుపొస్తుంది.

సెలవులకు యింటికెళ్ళినపుడల్లా హాస్టల్‌లో వుండనని గొడవ చేసేదాన్ని. అదివరకు "నేను కూడా బుజ్జక్కతోపాటు హాస్టల్‌లో చేరతాను" అని మారాం చేసే బాబీ తీరా హాస్టల్‌లో చేర్పించాక "నేను హాస్టల్ కెళ్ళను. నీ దగ్గరే వుంటానమ్మా" అని ఏడుపు మొదలెట్టాడు.

మా ఇద్దరికీ నచ్చి చెప్పలేక అమ్మా, నాన్నల తలప్రాణం తోకకొచ్చేది.

"ఈ వూర్లోనా హైస్కూలు లేదు. పోనీ మీ చదువులకోసం టౌనుకెళ్దామంటే మాకొచ్చే కూలీడబ్బులతో అక్కడ బతకడం కష్టం. అలాగని అక్కడ

నేను చదువులో ముందుండేదాన్ని. కొంచెం చురుకుగా కూడా వుండడంతో ప్రతి దానికీ "విద్యా, ఇలారా! ప్రార్థన చెయ్యి, అది చెయ్యి ఇది చెయ్యి" అని పిలిచేవాడు.

ఏదైనా తప్పు చేస్తే మాత్రం "ఎంత చదివినా నీ జాతి లక్షణం ఎక్కడికి పోతుంది" అనేవాడు.

నాకు ఆ రోజంతా అన్నం తినబుద్ధయ్యేది కాదు.

వార్డెన్ ఎవుడన్నా వూరెళ్ళినపుడు మాలో కొంతమందమ్మాయిలం వెళ్ళి ఆయన భార్యకు తోడు పడుకునేవాళ్ళం. ఆమె మాత్రం మేమంటే ప్రేమగా వుండేది.

నాకు ఆమెతో మాట్లాడాలంటే ఇష్టంగా అనిపించేది. ఆమెను ఆంటీ అని పిలిచేదాన్ని.

ఒక రోజు వార్డెన్ గారు ప్రార్థన అయిపోగానే నన్ను పక్కకి పిలిచి "ఈ రోజు నేను వూరు వెళ్తాను. సాయంత్రం ఆంటీకి తోడు పడుకో..." అన్నారు.

"అలాగే సార్!" అన్నాను వినయంగా.

సాయంత్రం భోజనం అవ్వగానే స్టడీ అవర్‌కెళ్ళకుండా ఆంటీ దగ్గర చదువుకోవచ్చని పుస్తకాలు తీసుకుని బయలుదేరాను.

బెల్ నొక్కగానే వార్డెన్ గారొచ్చి తలుపు తీశారు. ఆయన ప్రయాణం వాయిదా పడిందేమో! అనుకున్నాను.

కాసేపాగి అటూ ఇటూ చూస్తే ఎవరూ కనిపించలేదు.

"ఆంటీ స్నానం చేస్తుంది. కూర్చోమ్మా విద్యా!" అని తలుపేశాడు.

రాతియుగం నాటి రాక్షసిబల్లి నా వళ్ళంతా పాకినట్టుంది.

"ఎవరికైనా చెప్పావంటే చంపేస్తా! ఏమీ జరగనట్టుందు!" వార్నింగ్ ఇచ్చాడు. ఏడుపు తన్నుకొస్తున్నా బలవంతంగా ఆపుకుని హాస్టల్‌లో కొచ్చాను.

నా చురుకుతనమంతా నీరుకారిపోయింది. చదువు మీద శ్రద్ధ లేదు. ఏ పనీ చెయ్యాలని లేదు. తెలియని భయం, వణుకు నన్ను ఆవరించింది. జరిగిందంతా ఎవరికైనా చెప్పి పెద్దగా ఏడవాలనుంది.

అమ్మకి చెబితే...! అమ్మో...ఇంకేముంది...

ఎవరికైనా చెబితే నన్ను హాస్టల్ నుండి పంపించేస్తారేమో! హాస్టల్ నుండి వెళ్ళగొడితే నాన్న నన్నెలా చదివిస్తాడు...? చదువంటే ఇష్టముండబట్టేకదా! ఇంతకాలం హాస్టల్‌లో పురుగుల అన్నం కూడా తిని చదువుకుంది...!

చదువు మానేస్తే విలువ వుండదంట!

అపుడు నేనూ అమ్మలాగే పొలం పనులు చెయ్యాలి...ఎలా? నాలో నేను మధనపడుతూ లోపల రహస్యంగా ఏడ్చుకుంటూ కాలం గడుపుతున్నాను.

"ఎవరికైనా తెల్సిందంటే ఇంకేం లేదు" అన్నట్టు వురిమి చూస్తున్న వార్డెన్ నాకు భూతంలా కనిపిస్తున్నాడు. వాడ్ని చూస్తే వళ్ళు గగుర్పొడుస్తుంది. కడుపులో చెయ్యి పెట్టి దేవినట్టుంది.

ఆదివారంనాడు అమ్మొస్తే ఎప్పటిలా కేరింతలు కొట్టలేకపోయాను. "బుజ్జీ! ఏమ్మా! అలాగున్నావు? బయట చేరావా? కడుపులో నొప్పిగా వుందా?"

"ఊ..."

"అన్నింటికీ వూ.... అంటావేందే...! మీ నాన్న మీద దిగులుగా వుందా! వార్డెన్ గారినడిగి ఇంటికెళ్దామా...!"

"వద్దమ్మా! నేను బాగానే వున్నాను. కొంచెం కడుపులో నొప్పిగా వుంది. అంతే...!" అన్నాను.

ఆ రోజు బాబీని చూడాలనిపించలేదు. అమ్మ ఒక్కతే నా వైపు వెనక్కి తిరిగి చూసుకుంటూ వెళ్ళలేక వెళ్తూ బుజ్జీ! భద్రం తల్లీ! అంది.

కడుపు నొప్పి అంటే జ్ఞాపక మొచ్చింది. నెల నెలా వద్దన్నా వచ్చి నన్ను ఏడిపించే కడుపు నొప్పి రావడం ఆగిపోయింది.

పోనీలే! కడుపు నొప్పి రావడం లేదని కొంచెం సంతోష పడ్డాను. నా కడుపులో నొప్పి మాయమైంది. కానీ పొట్ట మాత్రం బరువెక్కుతుంది. రోజు రోజుకు పెరుగుతున్న దీన్ని చూస్తే దిగులుపుట్టి నీరస మొస్తుంది. ఇలా ఎందుకవుతుంది...?

ఎవరినయినా అడగాలంటే భయంతో నోట మాట రావడం లేదు. ఆదీకాక ఈ మధ్య మనుషులతో మాట్లాడే అలవాటు పోయి ఒంటరిగా అనిపిస్తుంది.

ఎవరికైనా చెబితే నన్ను వార్డెన్ హాస్టల్ నుండి పంపిస్తాడేమో...! నేనెలా చదువుకునేది...! ●

వచ్చేవారం కథ
**ఇల్లీగల్**
వైశాలి & డి.ఆర్. ఇంద్ర